క్లుప్తంగా

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి సహాయం



నిహారిక తల్లిదండ్రులకు చెక్కు అందిస్తున్న తలాటం హరీష్

బోట్‌క్లబ్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నిహారిక ఆపరేషన్‌కు హరీష్ మిత్ర బృందం సభ్యులు అండగా నిలిచారు. కాకినాడ టుటౌన్ వద్ద గల సానా సతీష్ బాబు ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం రూ.1.05 లక్షల చెక్కును నిహారిక తల్లిదండ్రులు స్వామి, సత్యవతి దంపతులకు అందించారు. ఈ సందర్భంగా తలాటం హరీష్ మాట్లాడుతూ నిహారిక సమస్యను సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు కుమారుడు మోహన్ వర్మ తమ దృష్టికి తీసుకురాగా తన వాట్సాప్ గ్రూప్‌లో పెట్టగా మిత్రులు స్పందించి విరాళం అందజేసారన్నారు. నిహారిక ఆపరేషన్ విజయవంతమై త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నిహారిక తండ్రి స్వామి మాట్లాడుతూ తన కుమార్తె ఆపరేషన్‌కు సాయం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగంలో మార్పు తీసుకురావాలి

కాకినాడ సిటీ: యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ అశోక్‌నగర్‌లో ఎంఎస్ఎన్ పాఠశాల ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రైవేట్ పాఠశాలల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫెడరేషన్ ఎప్పటికప్పుడు ప్రైవేటు విద్యా సంస్థల సమస్యలపై పోరాటం చేస్తుందని, పాఠశాల యాజమాన్యాలు విద్యారంగంలో పలు మార్పులు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ విద్యారంగం ఎదుర్కొంటున్నన్న సమస్యలపై మతుకుమిల్లి శ్రీవిజయ్ చేస్తున్న పోరాటాన్ని అభినందిస్తూ ఫెడరేషన్ అందరూ తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎర్రంశెట్టి సురేష్, స్టేట్ లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ తదితరులు మాట్లాడారు.

కరప తహసీల్దార్‌గా వెంకటగోపాలకృష్ణ



కరప: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం తహసీల్దార్‌గా పిండి వెంకటగోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కృష్ణా జిల్లా నుంచి బదిలీపై వచ్చిన వి.రామకోటేశ్వరరావు కరప మండల తహసీల్దార్‌గా పని చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రామకోటేశ్వరరావు తిరిగి సొంత జిల్లాకు బదిలీపై వెళ్లారు. చింతపల్లిలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న వెంకటగోపాలకృష్ణ బదిలీపై కరప వచ్చి బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచర్రావు, మండలంలోని వీఆర్వోలు వెంకటగోపాలకృష్ణకు అభినందనలు తెలియజేశారు.

ఆకట్టుకున్న శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రదర్శనలు



కాకినాడ ఎస్ఆర్ఎంటీ మాల్ వద్ద శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన

కాకినాడ రూరల్: పెద్దాపురం రామారావుపేట, కాకినాడ సురేష్‌నగర్‌లో గల శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ విద్యార్థులు ఆదివారం సాయంత్రం సర్పవరం జంక్షన్ వద్ద ఎస్ఆర్ఎంటీ మాల్‌లో సాహసం చేయరా డింభకా ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. సందర్శకులు తిలకించేలా విద్యార్థులు కేరళ యుద్ధ క్రీడ కళరిపయట్టు, రోప్ స్కిప్పింగ్ నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టరు విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ కేరళలో ప్రసిద్ధిగాంచిన యుద్ధ క్రీడను పెద్దాపురంలో తమ విద్యార్థులకు కృష్ణదాస్ గురుకుల్, కావ్య శిక్షణ ఇచ్చారన్నారు. మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు మాల్‌లో ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం శ్రీమ్ అపర్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పాలిటెక్నిక్ విద్యార్థిని రాయవరపు అనుగ్రహ చదువు ఖర్చు సహాయార్థం రూ.8,500 చెక్కును అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కంటి వైద్య పరీక్షల్లో విద్యార్థిని కాదా అపర్ణకు టోక్సోప్లాస్మోసిస్ నిర్ధారణ కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4,200 చెక్కును అందజేశారు. చైర్మన్ ఏ. వెంకటేశ్వర శర్మ, సభ్యులు వీరబద్రం, డాక్టర్లు సూర్య పవన్‌రామ్, నాగ మనోజ్ఞ పాల్గొన్నారు.



ఆడేందుకు అనువుగా లేని డీఎస్ఏ ఫుట్‌బాల్ గ్రౌండ్



వర్షాలకు విరిగిన చెట్టు



డీఎస్ఏ ఆవరణలో పశువుల సంచారం

క్రీడా మైదానం.. నిర్వహణలేక అధ్వానం

- 38 ఏళ్ల చరిత్ర కలిగిన మైదానం
- 18 ఎకరాల విస్తీర్ణంలో స్టేడియం
- నెలకు రూ.6 లక్షలకుపైగా ఆదాయం
- అవుట్‌డోర్ మైదానాలన్నీ తుప్పలతో నిండి బురదమయం
- పట్టించుకోని డీఎస్ఏ అధికారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తొలి క్రీడాభివృద్ధి అధికారిగా డేవిడ్ లివింగ్‌స్టన్ బాధ్యతలు నిర్వహించారు. సమీర్ శర్మ కలెక్టర్‌గా ఉన్న సమయంలో క్రీడామైదానంలో పెవిలియన్లు నిర్మాణాన్ని చేపట్టారు. డీఎస్ఏ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా వైడీ రామారావు, లంకల పల్లి రామారావు వ్యవహరించారు. జేఎస్వీ ప్రసాద్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి రూ.6 లక్షలు మంజూరు చేసి క్రీడామైదానంలో వివిధ ప్లే ఫీల్డ్స్ ఏర్పాటు చేశారు. 38 ఏళ్ల చరిత్ర కలిగిన క్రీడా మైదానం. ఈ మైదానంలో ఎందరో క్రీడాకారులు ఓనమాలు నేర్చుకుని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారయ్యారు. రాష్ట్రంలోనే సుమారు 18 ఎకరాల సువిశాల ప్రాంగణంలో నెలకొన్న స్టేడియం. నేడు డీఎస్ఏ అధికారుల నిర్లక్ష్యం, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సమస్యలతో సతమతమవుతోంది. వివరాల్లోకి వెళితే...

కాకినాడ నాగమల్లితోట జంక్షన్ నుంచి ఎస్ఎఫ్‌సీఏల్‌కి వెళ్లే రోడ్డులోని జిల్లా క్రీడామైదానం (డీఎస్ఏ)లో ప్రతి రోజు వందలాది సంఖ్యలో క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందుతున్నారు. ఉదయం 6 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 7 వరకు ఇక్కడ అనుభవజ్ఞులైన శాప్, డీఎస్ఏ కోచ్ క్రీడాకారులకు 13 క్రీడల్లో ఓనమాలు నేర్పుతూ వారిని రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. వందల సంఖ్యలో వాకర్స్ డీఎస్ఏ వాకింగ్ ట్రాక్‌లో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నడక వ్యాయామం చేస్తుంటారు.

ఆదాయం ఘనం

ఆదాయం పరంగా శాప్‌కు రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఆదాయం సమకూర్చే డీఎస్ఏ క్రీడాభివృద్ధి అధికారులు సరైన రీతిలో పట్టించుకోకపోవడం వల్ల మైదానం నిర్లక్ష్యానికి గురవుతోంది. క్రీడామైదానం అంతా ఎక్కడ చూసినా నీటి నిల్వలు, తుప్పలు పెరిగి పోయి అధ్వానంగా తయారైంది. దీంతో వాకింగ్ ట్రాక్‌లో నడవాలంటే వాకర్స్ బెంబేలెత్తి పోతున్నారు. తాచు పాములు సంచారంతో బిక్కుబిక్కుమని వాకింగ్ చేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడి నీటి నిల్వల వల్ల క్రీడాకారులు తరచూ మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. క్రీడామైదానంలో పశువులు సంచరిస్తూ పలు ప్లే ఫీల్డ్స్‌ను ధ్వంసం చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాకర్స్ చెబుతున్నారు. అవుట్ డోర్ ఫీల్డ్‌లన్నీ దాదాపు వర్షం నీటి నిల్వలతో ఉండడంతో క్రీడాంశాల సాధన కష్టంగా ఉంటోందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



స్క్వాష్ కోర్టు ముందు వర్షం నీరు

డీఎస్ఏ నిర్వహణకు నిధుల కొరత

నెలకు సమారు రూ.6 లక్షల ఆదాయం డీఎస్ఏకు ప్లే అండ్ ప్లే విధానం, షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దెల రూపంలో సమకూరుతోంది. దీంతో పాటు క్రికెట్ మైదానం, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రైవేట్ టోర్నమెంట్లకు రోజు వారీ అద్దెల రూపంలో ఇవ్వడంతో మరికొంత రెవెన్యూ డీఎస్ఏకు సమకూరుతోంది. డీఎస్ఏకు సంబంధించి క్యూఆర్ కోడ్‌ల అకౌంట్లలో ఈ డబ్బులు జమ అవుతున్నాయనే వాదన వినిపిస్తోంది. కోచ్‌లు ప్రతి నెల నేరుగా శాప్‌కు డబ్బులు పంపించడంతో డీఎస్ఏకు ప్రతి నెల ఎంత వస్తుంది అనే లెక్క డీఎస్ఏ అధికారుల వద్ద ఉడటం లేదని కొందరు వాకర్స్ పెదవి విరుస్తున్నారు. అయితే డబ్బులు అన్నీ శాప్‌కే పంపిస్తున్నాం, దీంతో డీఎస్ఏ నిర్వహణకు నిధులు ఉండడం లేదని అధికారులు చెబుతున్నారు. డీఎస్ఏకు సంబంధించిన క్యూఆర్ కోడ్ అకౌంట్లను ఉన్నతాధికారులు పరిశీలించి ఆదాయం డీఎస్ఏకు చెందేలా చర్యలు తీసుకోవాలని క్రీడాసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఏది ఏమైనా డీఎస్ఏను జిల్లా ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి క్రీడామైదానాలను అభివృద్ధి చేసి, తుప్పలు, గడ్డి మొక్కలు, నీటి నిల్వలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



వాకింగ్ ట్రాక్ ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పల మధ్య నడుస్తున్న వాకర్స్

దంత వైద్యంలో ఆధునిక పద్ధతులు

బోట్‌క్లబ్: ప్రతి వ్యక్తికి సరైన దంత సంరక్షణ ఎంతో అవసరమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట జంక్షన్ వద్ద ఉన్న సత్య దంత వైద్యశాల్లో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ దంతాల సమలేఖనం దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ స్వరూప్ మాట్లాడుతూ చిన్న వయస్సులో మన అలవాట్ల కారణంగా దంతాలు వంకరగా ఎత్తుగా సరైన క్రమంగా లేకపోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి సమస్యలకు పూర్వం మెటల్, సిరామిక్ బ్రేసెస్ వైర్ సహాయంతో వేసేవాళ్లమని, ఇప్పుడు ఎలైనర్స్ వైద్య సదుపాయంతో ఆర్థోడెంటిక్ వైద్యం మరింత సులభతరమైనదన్నారు. నోటిని స్కానర్ సహాయంతో నమూనా తీసుకుని ఎలైనర్స్‌ను కిట్ రూపంలో ఒక్కసారే అందిస్తామని దీంతో సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర, సభ్యులు చైతన్య, సిరాజ్, పద్మావతి, భవానీ పాల్గొన్నారు.

నూతన భవనానికి సంజీవరావు పేరు పెట్టాలి

కాకినాడ రూరల్: నగరపాలక సంస్థ నూతన భవనానికి కేంద్ర మాజీ మంత్రి, దివంగత మల్లిపూడి శ్రీరామ సంజీవరావు పేరు పెట్టాలని, ఆయన విగ్రహాన్ని భానుగుడి సెంటరులో ఏర్పాటు చేసి సముచిత స్థానం కల్పించాలని ఆంధ్ర కాపు సద్భావన సంఘం కోరింది. కాకినాడ ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో శుభం కాపు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సంఘ సర్వ సభ్య సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లిపూడి కుటుంబంలో ముగ్గురు కేంద్ర మంత్రులుగా పనిచేసి కాకినాడ అభివృద్ధికి కృషి చేయడంతో ఆ కుటుంబానికి సముచిత స్థానం కల్పించేలా సిటీ, రూరల్ శాసన సభ్యులు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు బసవా ప్రభాకరావు, నాయకులు చిట్నీడి శ్రీనివాస్, అడపా ప్రకాస్ నాయుడు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా గణపతి ఉత్సవాలు



కాకినాడ గణేశ ఉత్సవ సమితి సమావేశంలో మాట్లాడుతున్న దూసర్లపూడి రమణరాజు

కాకినాడ రూరల్: కాకినాడ నగర గణేశ ఉత్సవ సమితి సమావేశం స్థానిక గంగరాజు నగర్ 3వ వీధిలో ఆదివారం నిర్వహించారు. సమితి కో కన్వీనర్ గ్రామీణ పదాధికారి రంభాల వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి సమితి కన్వీనర్ యెనిమిరెడ్డి మాలకొండయ్య అధ్యక్షత వహించారు. సమితి గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ పర్యావరణానికి, జలాలకు హానికరంకాని రంగులు వాడని గణపతి విగ్రహాలను పూజించి తరించాలన్నారు. మాలకొండయ్య మాట్లాడుతూ గణేశ ఉత్సవాల నిర్వహణకు అన్ని శాఖల అధికారుల నుంచి సహకారం కోరుతున్నామన్నారు. రంభాల వేంకటేశ్వరరావు మాట్లాడుతూ సిటీలో జగన్నాథపురం రెండు వంతెనల నడుమ వార్ఫ్ రోడ్డు, వినాయక సాగర్, రూరల్‌లో సూర్యారావుపేట సముద్రతీరంలో సెప్టెంబర్ 16న గణేశ నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆగస్ట్ 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని, సమితి వేడుకలను సాంబమూర్తినగర్ డాల్ఫిన్ కాలనీలో నిర్వహించాలని నిర్ణయించారు. సమితి సీనియర్ కార్యనిర్వాహకులు బొలిశెట్టి వేంకట రామకృష్ణ పెండెం సత్య నారాయణ, దిలీప్ కుమార్ సదనాని తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శ్రావణ మాసం మొదటి ఆదివారం సైతం మరిడమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ క్యూ కట్టారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపట్టారు. ఆలయ జాతర మహోత్సవం తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ లతా కుమారి ఆదేశాల మేరకు సీఐ టి.క్రాంతి కుమార్ పర్యవేక్షణలో ఎస్సై మౌనిక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.



పెద్దాపురంలో ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

కాకినాడ రూరల్: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జెండా ఆవిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో 500 బైకులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ నుంచి సర్పవరం జంక్షన్, భానుగుడి, మసీద్ సెంటర్, జగన్నాథపురం వంతెన, వారపు రోడ్డు నుంచి జెడ్పీసెంటర్ మీదుగా బాలాజీ చెరువు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమం చిత్ర పాపారావు జోనల్ ఇన్‌చార్జ్ అనపర్తి వెంకటేష్, జిల్లా ఇన్‌చార్జ్ సలాది అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ యువమోర్చా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలో తిరంగా యాత్ర ప్రారంభిస్తామన్నారు. ఈరోజు నుంచి ప్రతి గ్రామంలో మండలంలో తిరంగా ర్యాలీలతో పాటు ప్రతి భారతీయుడు తన ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, రూరల్ అసెంబ్లీ కన్వీనర్ పితాని లీలావతి, కార్యక్రమం ఇన్‌చార్జ్ సలాది అనిల్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, పెండెం సత్యనారాయణ, రూరల్ మండల అధ్యక్షుడు నందూరి సత్తిబాబు తదితర నాయకులు, యువ మోర్చా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

బోట్‌క్లబ్: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరు రామకుమార్ అన్నారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు చిత్ర పాపారావు అధ్యక్షతన హర్ ఘర్ తిరంగా అభియాన్ బైక్ యాత్ర ఆదివారం నిర్వహించారు. కాకినాడలో పలు ప్రాంతాల్లో ఈ యాత్ర సాగింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డ ఆదేశాల మేరకు ఈ నెల 11 నుంచి 15 వరకు జిల్లాలో హర్ ఘర్ తిరంగ నినాదంతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల సూర్యనారాయణ రాజు, కాకినాడ సిటీ కన్వీనర్ గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వైభవంగా పైడితల్లి అమ్మవారి పండగ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో పైడితల్లి అమ్మవారి పండగ ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారి పండగను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు రీసు సత్యనారాయణ, రాళ్ల సీతారాం, రీసు నాగరాజు, కండిపల్లి రాజు, పితాని పెద్దచంటి, బొందలపు రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అర్బన్ ప్రాంతాలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలి

కాకినాడ సిటీ: పాలక వర్గాలు లేని తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాల, వాకలపూడి, రమణయ్యపేట అర్బన్ ప్రాంతాలను కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్ డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ సెంటర్ శాఖ సమావేశం ఆదివారం కాకినాడ సుందరయ్య భవన్‌లో కె సింహాచలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 13 ఏళ్లుగా ఈ ఆరు ప్రాంతాల్లో పాలకవర్గాలు లేకపోవడం వల్ల ఈ గ్రామాల్లో మంచినీరు, డ్రైయినేజీ, సామాజిక స్థలాల పరిరక్షణ లాంటి అనేక సమస్యలు పేరుకుపోయాయన్నారు. ఇన్‌ఛార్జి అధికారుల పాలన వల్ల ఈ గ్రామాల్లో అవినీతి విపరీతంగా పెరిగిందన్నారు. ప్రజాసమస్యలు పట్టించుకునే నాథుడే లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో గవర్నర్ ఆదేశాలతో ఈ గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం కావడంతో రికార్డులో ఇవి అర్బన్ ప్రాంతాలుగా ఉన్నాయని గుర్తు చేశారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వం ఇప్పటికీ కార్పొరేషన్‌లో విలీనం చేయడపోవడాన్ని రాజశేఖర్ తప్పుపట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పంచాయతీ శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ఈ గ్రామాలను కార్పొరేషన్‌లో విలీన ప్రక్రియను చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీపీఎం కోరుతుందన్నారు. కాకినాడ సిటీ ప్రాంతాన్ని విస్తరణ జరపడం ద్వారా కేంద్రం నుంచి ఎక్కువ నిధులు సమీకరించడం, తద్వారా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సీపీఎం కోరుతుందని రాజశేఖర్ అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు సీహెచ్ అజయ్‌కుమార్, కె వీరబాబు, సీహెచ్ రమణి, వి నవీన్ పాల్గొన్నారు.

ఏనీటైమ్.. పనిచేయవు!

- మొరాయించిన నగరంలోని ఏటీఎంలు
- ఆరు నెలలకోసారి చార్జీల వసూలు
- సీడీఎంల పరిస్థితి మరింత అధ్వానం
- అయోమయంలో ఖాతాదారులు

బోట్‌క్లబ్: అత్యవసర పరిస్థితుల్లో నగదు కోసం ఏటీఎంలకు పరుగుతీసినా అక్కడ నో క్యాష్ బోర్డు దర్శనమిస్తుంది. ఆపసోపాలు పడి మరో బ్యాంకు ఏటీఎం దగ్గరకు వెళ్లినా అది కూడా మూసివేసి ఉంటుంది. దీంతో ఖాతాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాకినాడ నగరంలో ఒక్క ఎస్‌బీఐ బ్యాంకుకు సంబంధించి 23 శాఖలు ఉన్నాయి. ఒక్కొక్కశాఖలో 70 నుంచి లక్ష వరకూ ఖాతాదారులున్నారు. ఈ ఖాతాదారుల నుంచి ఏటీఎం వినియోగించినందుకు చార్జీల రూపంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి రూ.180 వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్క ఎస్‌బీఐ వినియోగదారులు నుంచి కాకినాడ నగరంలో ఆరు నెలలకు రూ. 37.26 కోట్లు వసూలు చేస్తున్నారు. ఎస్‌బీఐ ఏటీఎంలు మాత్రం ఎక్కడా సక్రమంగా పని చేయవు. చార్జీలు మాత్రం ఖాతాదారుని ఖాతా నుంచి లాగేసుకుంటున్నారు. సేవలు మాత్రం సక్రమంగా అందించడం లేదు. ఇక యూనియన్ బ్యాంకులు, కెనరా బ్యాంకుతోపాటు ఇతర బ్యాంకు వందకు పైగా శాఖలు ఉన్నాయి. వాటన్నింటికీ క్రమం తప్పకుండా ఏటీఎం చార్జీలు వసూలు చేస్తున్నప్పటికీ ఆయాశాఖలకు చెందిన ఏటీఎంలో మాత్రం డబ్బులు మాత్రం ఉండడం లేదు.

పని చేయని సీడీఎంలు

సీడీఎం (క్యాష్ డిపాజిట్ మెషిన్)లు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. అత్యవసరంగా ఖాతాల్లో డబ్బులు వేసుకునేవారు కొందరైతే, వేరేవాళ్లకు డబ్బులు పంపేవారు మరికొందరు. స్టేట్‌బ్యాంకు, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకుతో పాటు పలు బ్యాంకులు ఆయా బ్రాంచ్‌లు సమీపంలో సీడీయం మిషన్లు ఏర్పాటు చేసింది. కానీ ఇవి సక్రమంగా పని చేయడం లేదు. అవసరానికి డబ్బులు వేస్తే మిషన్ మరమ్మతుల కారణంగా సగంలోనే ఆ ప్రక్రియ నిలిచిపోవడంతో డబ్బులు ఖాతాల్లో పడక, వినియోగదారుడు చేతికిరాక దిక్కుతోచక ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నాడు. సీడీఎంలో డబ్బులు వేసే సమయంలో నెట్‌వర్క్ సక్రమంగా లేకపోతే డబ్బులు తమ ఖాతాలో జమకావు. దీంతో బ్రాంచ్‌కు వెళ్లి పరిస్థితి వివరించి అక్కడ దరఖాస్తు చేసుకుంటే అక్కడ సిబ్బంది పరిశీలించి నాలుగైదు రోజుల్లో ఆ నగదు మన ఖాతాల్లో వేస్తారు. అవసరం కోసం డబ్బులు వేస్తే నాలుగైదు రోజుల వరకూ డబ్బులు జమ కావడం లేదని వినియోగదారులు అంటున్నారు. దూర ప్రాంతాల్లో చదువుకుంటున్న తమ పిల్లల ఖాతాల్లో డబ్బులు వేసినా వారికి అవి వేగంగా అందకపోవడంతో తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ బాధలు పడలేక నేరుగా ఖాతాల్లో డబ్బులు వేద్దామని అనుకుంటే బ్యాంకుల్లో చిన్న మొత్తాలు సీడీఎంలో వేసుకోవాలని పెద్ద మొత్తం మాత్రమే ఇక్కడ డిపాజిట్ చేయాలని సిబ్బంది ఖాతాదారుల చెప్పడంతో వారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని బ్యాంకుల్లో చిన్న మొత్తాలను తీసుకోని పరిస్థితి ఉంది. రూ. 50 వేలు పైబడి డిపాజిట్ చేసేవారు మాత్రమే బ్యాంకులకు రావాలని, తక్కువ మొత్తం డిపాజిట్లు తీసుకోవద్దన్న నిబంధనలున్నాయని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు.



రాజేశ్వరినగర్‌లో పనిచేయని సీడీఎం యంత్రం



భానుగుడి సెంటర్ వద్ద పనిచేయని ఏటీఎం

సీడీఎంలు పనిచేయడం లేదు



బ్యాంకు సమయం ముగిసిన తర్వాత ఎవరికైనా అత్యవసరం డబ్బులు పంపుదామని సీడీఎం మెషీన్ వద్దకు వెళితే అవి పనిచేయడం లేదు. ఎవరైనా సీడీఎంలో డబ్బు వేసినా మా ఖాతాల్లోకి వేగంగా జమ కావడం లేదు. మళ్లీ బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేసిన నాలుగైదు రోజులు తర్వాత మా ఖాతాల్లోకి వస్తున్నాయి. దీంతో అవసరం తీరడం లేదు. – దొరబాబు, వ్యాపారి

వినియోగించేవారు తక్కువే

ప్రస్తుతం ఏటీఎం వినియోగించే వారు బాగా తగ్గిపోయారు. ప్రస్తుతం ఫోన్ పే, గూగుల్ పే, పేటీయం వంటి యూపీఐ సేవలు అందుబాటులోకి రావడంతో దాదాపు 90 శాతం మంది వీటిపైనే ఆధారపడుతున్నారు. ఏటీఎంలు వినియోగించేవారు 10 శాతం మాత్రమే ఉంటున్నారు. వినియోగించేవారు తక్కువగా ఉన్నా ఏటీఎంలో క్రమం తప్పకుండా డబ్బులు పెట్టకుండా ఖాతాదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. డబ్బులు అయిపోయిన రెండు మూడు రోజులకు కూడా నింపకపోవడంతో ఖాతాదారులకు అవస్థలు తప్పడం లేదు.

ఏటీఎంలలో డబ్బు నింపే పని ప్రైవేటు ఏజెన్సీలకు..

ఏటీఎంలో డబ్బులు నింపే పనిని ఆయా శాఖలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి బ్యాంకులు చేతులు దులుపుకుంటున్నాయి. డబ్బులు అయిపోయిన వెంటనే ఆయా ఏటీఎంలో డబ్బులు నింపకపోవడంతో తరచూ ఏటీఎం వినియోగదారులు బాధలు వర్ణనాతీతం. సొంతంగా బ్యాంకు డబ్బులు నింపే ఏటీఎంలో కాస్త మెరుగుగానే సేవలు అందుతున్నాయి. అక్కడ ఖాతాదారులు ఫిర్యాదు చేస్తే వెంటనే సిబ్బంది ఏటీఎంలో డబ్బులు నింపుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పని సరి

కొత్తపల్లి: కాలానుగుణంగా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారిణి సౌజన్య అన్నారు. మండలంలోని నాగులపల్లి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో ఆదివారం సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఈ కాలంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఫ్లూ జ్వరాలు అధికంగా వచ్చే అవకాశం ఉందని అటువంటి వారిని ఉపాధ్యాయులు గుర్తించి పాఠశాలలకు రాకుండా ఇళ్ల వద్దే విశ్రాంతి తీసుకునేలా చూడాలన్నారు. పాఠశాలకు వస్తే ఇతర విద్యార్థులకు కూడా ఈ ఫ్లూ జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీలేదు. లక్షణాలకు అనుగుణంగా చికిత్సను అందించాలన్నారు. ఈ వ్యాధికి ప్లేట్‌లెట్స్ తగ్గుతాయని తెలిపారు. డెంగీని వ్యాప్తిచేసే ఏడిస్ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. ఈ దోమ కుట్టినప్పటి నుంచి ఒళ్లు నొప్పి, కళ్లు లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడంతోపాటు పలు లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా ఇళ్ల వద్ద మురికినీరు, నిరుపయోగంగా ఉండే డ్రమ్ములు, రుబ్బురోళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వేడి పదార్థాలు భుజించడం, కాచిచల్లార్చిన నీరు తాగాలన్నారు. పిల్లలకు పళ్ల రసాలు ఎక్కువగా ఇవ్వాలన్నారు.